క్లుప్తంగా

రైతుబజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజారుల్లో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాటా 80, వంకాయ 35, బెండ 40, పచ్చిమిర్చి 90, కాకర 55, బీర 40, క్యాబేజీ 17, ఫ్రెంచి బీన్స్ 75–95, క్యారెట్ 45, దొండ 40–55, చిక్కుడు 65, గోకర 35, బీట్‌రూట్ 23, క్యాప్సికం 70, ఆలు 22, దోస 23, సొర 15, పొట్ల 23, ఉల్లిగడ్డ 22, చామగడ్డ 40. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చంపాపేట: విద్యుత్ సంబంధ మరమ్మతుల కారణంగా చంపాపేట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని ఈ కింది ప్రాంతాల్లో గురువారం కరెంట్ సరఫరా నిలిపివేస్తామని ట్రాన్స్‌కో ఏఈ విజయ్‌కుమార్ తెలిపారు.

- దుర్గా భవానీనగర్, మాదన్నపేట విద్యుత్ ఫీడర్ల పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు.. ఐఎస్ సదన్, డీఎస్‌నగర్, సెంట్రల్ ఎక్సైజ్, ఈస్ట్ మారుతీ నగర్, యాదగిరి నగర్, దుర్గాభవానీనగర్ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోండి

మలక్‌పేట: ప్రభుత్వ సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. పంజేషాహలోని కార్యాలయంలో బుధవారం నియోజకవర్గ పరిధిలోని అక్బర్‌బాగ్, మూసారంబాగ్, ఓల్డ్‌మలక్‌పేట, ఆజంపుర, సైదాబాద్, చావుని, డివిజన్లకు చెందిన 19 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సీఎంరిలీఫ్ ఫండ్ పేదలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పలువురు మజ్లిస్ నాయకులు పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టళ్లలోని సమస్యలను పరిష్కరించండి



ప్రిన్సిపాల్ సెక్రటరీ రాహుల్ బొజ్జాకు వినతిపత్రం అందజేస్తున్న కుమార్

నాగోలు: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎస్సీ పోస్ట్‌మెట్రిక్, ప్రీ మెట్రిక్ వసతి గృహాల్లోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ స్టూడెంట్స్ హాస్టల్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ముప్పూరి కుమార్ బుధవారం రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ రాహుల్ బొజ్జాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని వసతి గృహాల సమస్యలను పరిష్కరించి జీఓ 5,8,9, 35,48 49,126,171, 281లను పూర్తి స్థాయిలో అమలు చేయాలని కోరారు. నగరంలోని కాచిగూడ హాస్టల్‌ను మూసివేయడంతో ఎస్సీ విద్యార్థులు వసతి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే దానిని తెరవాలని కోరారు.

మెంటల్ అర్థమెటిక్ పోటీల్లో 'సిప్ అబాకస్' విద్యార్థుల ప్రతిభ



బహుమతులు అందుకున్న సిప్ అబాకస్ విద్యార్థులు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ వాసవి కాలనీలోని సిప్ అబాకస్ కార్యాలయంలో బుధవారం తెలంగాణ ప్రాంతీయ స్థాయి మెంటల్ అర్థమెటిక్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో కేవలం 11 నిమిషాల్లో 200 లెక్కలు చేయాల్సి ఉండగా, ఈ వివిధ ప్రాంతాలను నుంచి వచ్చిన 2500 విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారని నిర్వాహకులు తెలిపారు. పోటీలో సిప్ అబాకస్‌లో వాసవి కాలనీ విద్యార్థులు వివిధ విభాగాల్లో 123 ట్రోఫీలు గెలుచుకున్నారు. పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను సంస్థ నిర్వాహకురాలు సంధ్యారాణి అభినందించి బహుమతులు అందజేశారు.

విద్యార్థి అదృశ్యం

నాగోలు: ఇంటి నుంచి బయటకు వెళ్లిన విద్యార్థి కనిపించకుండాపోయిన ఘటన ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం..ఎల్బీనగర్ శ్రీరామ్‌నగర్ కాలనీలో నివాసం ఉండే కైత అనిల్(25) విద్యార్థి. ఫ్రెండ్స్ దగ్గర అప్పులు చేశాడు. గత నెల 27న ఇంటి నుంచి బయటకు వెళ్లిన అనిల్ తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు అతడి ఫోన్‌కు కాల్ చేయగా స్విచ్ఛాఫ్ వస్తోంది. బంధు,మిత్రులను అనిల్ గురించి వాకబు చేసినా ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబ సభ్యులు బుధవారం ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దుర్వాసన.. దోమల బెడద

- వరదనీటి కాలువలోకి చేరుతున్న డ్రైనేజీ నీరు
- మురుగు కంపు, దోమల విజృంభణ
- హస్తినాపురం నార్త్‌ఎక్స్‌టెన్షన్ కాలనీ వాసుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు



వరదనీటి కాలువలోకి మురుగునీరు చేరకుండా మరమ్మతులు చేపట్టి మధ్యలో వదిలేసిన దృశ్యం



హస్తినాపురం నార్త్‌ఎక్స్‌టెన్షన్ కాలనీలో వరదనీటి కాలువలో కలుస్తున్న మురుగునీరు

హస్తినాపురం: హస్తినాపురం డివిజన్‌లోని వివిధ ప్రాంతాలలో నిర్మించిన వరదనీటి కాలువల్లో మురుగు నీరు పారుతూ దుర్గంధం వెదజల్లుతుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హస్తినాపురం నార్త్‌ఎక్స్‌టెన్షన్ కాలనీలోని పరిస్థితే ఇందుకు నిదర్శనం. తమ కాలనీలో నిర్మించిన వరదనీటి కాలువలోకి పైకాలనీల నుంచి డ్రైనేజీ నీరు వచ్చి చేరుతోందని, ఎగసి వస్తున్న దుర్వాసనతో ఇళ్లలో ఉండలేకపోతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. సమస్యను పరిష్కరించాలని జలమండలి అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు.

- హస్తినాపురం నార్త్ ఎక్స్ టెన్షన్ కాలనీలో కోట్లాది రూపాయలు వెచ్చించి వరదనీటి కాలువలు నిర్మించారని, ఈ కాలువలోకి టీఎస్ఆర్ అపార్ట్‌మెంట్ల నుంచి డ్రైనేజీ నీరు వచ్చి చేరడంతో దుర్వాసన వస్తోందని కాలనీవాసులు చెప్తున్నారు.
- మురుగునీటి కారణంగా దోమలు అధికమై కాలనీపై దండయాత్ర చేస్తున్నాయని, రాత్రిపూట కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని వాపోతున్నారు.
- మురుగు కంపు, దోమల కారణంగా వ్యాధుల బారినపడే అవకాశంఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- తమ కాలనీలోని వరదనీటి కాలువలోకి మురుగునీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఫిర్యాదు చేస్తే ఏడాది క్రితం వరద కాలువలో మురుగు కలుస్తున్న ప్రాంతంలో మరమ్మతుల పేరుతో జలమండలి, సాహెబ్‌నగర్ సెక్షన్ అధికారులు హడావుడి చేసి చేతులు దులుపుకున్నారని, పనులు జరుగుతున్నట్టు వారు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు ఇప్పటికీ అక్కడే ఉన్నాయని స్థానికులు చెప్తున్నారు.
- ఇప్పటికైనా జలమండలి ఉన్నతాధికారులు వరదనీటి కాలువలోకి మురుగు చేరకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇళ్లలో ఉండలేకపోతున్నాం..



కాలనీలోని వరదనీటి కాలువలోకి మురుగు కలవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో తాము ఇళ్లలో ఉండలేకపోతున్నాం. కేవలం వర్షం నీళ్లు వెళ్లడానికి ఏర్పాటు చేసిన కాలువలోకి డ్రైనేజీ నీరు కలుస్తుండటంతో తాము ఇబ్బందులు పడుతున్నాం. మురుగు నీటి వల్ల దోమలు పెరిగి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– చంద్రశేఖర్‌యాదవ్, హస్తినాపురం నార్త్‌ఎక్స్‌టెన్షన్‌కాలనీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు

లిఫ్ట్‌లో చిక్కుకున్న 15 మందిని రక్షించిన ఫైర్ సిబ్బంది

మలక్‌పేట: లిఫ్ట్‌లో గర్భిణితో సహా 15 మంది చిక్కుకున్న ఘటన మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, ఫైర్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మలక్‌పేట సూపర్‌బజార్‌లోని హైదరాబాద్ నెక్ట్స్ గలేరియా మూసారంబాగ్ పీవీఆర్‌లో సినిమాకు వెళ్లిన గర్భిణితో పాటు 15 మంది ఐదో అంతస్తులో లిఫ్ట్ ఎక్కారు. లిఫ్ట్ మధ్యలో ఆగిపోవడంతో అందులో ఉన్నవారు ఆందోళనకు గురయ్యారు. లిఫ్ట్‌లో ఉన్న ఓ వ్యక్తి డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో మలక్‌పేట పోలీసులు వెంటనే మలక్‌పేట ఫైర్‌స్టేషన్ సిబ్బందిని అక్కడికి రప్పించారు. అగ్నిమాపక సిబ్బంది అరగంట పాటు శ్రమించి లిఫ్ట్ డోర్‌ను తెరిచి అందులో ఉన్నవారిని సురక్షితంగా బయటికి తీసుకొచ్చారు. సాంకేతిక లోపంతో లిఫ్ట్ ఆగిపోయి ఉంటుందని అధికారులు తెలిపారు.

విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించాలి



గ్రూప్ లీడర్స్‌కు బ్యాడ్జీలు పెడుతున్న ఉపాధ్యాయులు

చంపాపేట: విద్యార్థుల్లో నిస్వార్థ, సేవాభావంతో కూడిన నాయకత్వ లక్షణాలు పెంపొందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని రవీంద్ర భారతి గ్లోబల్ పాఠశాలల జోనల్ ఇన్‌చార్జి బాబూరావు అన్నారు. బుధవారం చంపాపేటలోని రవీంద్ర భారతి గ్లోబల్ పాఠశాలలో నిర్వహించిన ఇన్‌వెస్టిట్యూర్ సెర్మనీకి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నూతనంగా ఎంపికైన పాఠశాల గ్రూప్ లీడర్స్‌ను అభినందించారు. అనంతరం పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి మొక్కలను నాటారు. కార్యక్రమంలో విద్యాసంవత్సర డైరెక్టర్ రాణి,ఇన్‌చార్జి దయాకర్, ప్రిన్సిపల్ స్వప్న, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా కోర్టులో ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి పట్టాభి రామారావు

రంగారెడ్డి కోర్టులు: న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా కోర్టులో గురువారం అవేర్ గ్లీనీగల్స్ గ్లోబల్ హాస్పిటల్స్ వారు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి డాక్టర్ పట్టాభి రామారావు ఈ శిబిరాన్ని ప్రారంభించి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్య సిబ్బంది పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులతో పాటు మొత్తం 297 మందికి మధుమేహం, బీపీ, ఈసీజీ, 2డి ఎకో వంటి పరీక్షలు చేసి పలు ఆరోగ్య జాగ్రత్తలు సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు డీకొండ రవీందర్, ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల మాధవ రెడ్డి, న్యాయవాదుల పరస్పర సహకార సంఘం సంచాలకుడు డాక్టర్ బాచిరెడ్డి శాయిరెడ్డి, బార్ కౌన్సిల్ సభ్యులు అనంతసేన్ రెడ్డి, రామారావు పాల్గొన్నారు.

కూరగాయల ధరల పెరుగుదలపై కాంగ్రెస్ నిరసన



ర్యాలీలో పాల్గొన్న రాంరెడ్డి తదితరులు

చైతన్యపురి: కూరగాయల ధరలు తారస్థాయికి చేరడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు జయమ్మ ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ, ధర్నా నిర్వహించారు. చైతన్యపురిలోని ఎల్బీనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి దిల్‌సుఖ్‌నగర్ రాజీవ్‌చౌక్ వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో పార్టీ అధికార ప్రతినిధితో కలిసి ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేడు పొయ్యి మీదకు వెళ్లకుండానే అంగట్లో కూరగాయల ధరలు ఉడికి పోతున్నాయన్నారు. కూరగాయలను ముట్టుకుంటే కాదు.. వాటి ధరలను చూస్తేనే నేడు షాక్ కొడుతోందన్నారు. కాంగ్రెస్ హయాంలో రూ. 400 ఉన్న వంట గ్యాస్ ధరలు నేడు రూ.1200కు పెరిగిందన్నారు. టమాటా ధరలు బంగారం ధరలను తలపిస్తున్నాయని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో నాయకులు గుర్రం శ్రీనివాసరెడ్డి, మకుటం సదాశివుడు, వేణుయాదవ్, కిషోర్‌గౌడ్, నర్సింహయాదవ్, గజ్జి శ్రీనివాస్, స్వర్ణమాధవి, రమేష్‌నాయక్, రాజశేఖర్, గోవర్ధన్, జైపాల్‌రెడ్డి, హుస్సేన్ పాల్గొన్నారు.

మాజీ మేయర్ బొంతుకు నేతల శుభాకాంక్షలు



బొంతు రామ్మోహన్‌కు శుభాకాంక్షలు తెలిపిన సామ సుందర్‌రెడ్డి తదితరులు

సైదాబాద్: జీహెచ్ఎంసీ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్‌కు బీఆర్ఎస్ నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం యాకుత్‌పురా నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ సామ సుందర్ రెడ్డి, ఐఎస్‌సదన్ డివిజన్ పార్టీనాయకులతో కలిసి బొంతు రామ్మోహన్‌కు శాలువా కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణలో బీఆర్ఎస్ మూడోసారి విజయం సాధించేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని బొంతు రామ్మోహన్ నేతలకు సూచించారు.

యూత్ కాంగ్రెస్ క్యాంపెయిన్ ఇన్‌చార్జిగా శివచరణ్‌రెడ్డి



బీవీ శ్రీనివాస్ నుంచి నియామకపత్రం అందుకుంటున్న జక్కిడి శివచరణ్‌రెడ్డి

మన్సూరాబాద్: తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ క్యాంపెయిన్ ఇన్‌చార్జిగా ఎల్బీనగర్‌కు చెందిన జక్కిడి శివచరణ్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు బీవీ శ్రీనివాస్ బుధవారం ఆయనకు నియామక పత్రం అందజేశారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు శివచరణ్‌రెడ్డి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

నేడు పెంపుడు జంతువులకు ఉచితంగా టీకాలు

హయత్‌నగర్: ప్రపంచ జునోసిస్ డే సందర్భంగా గురువారం పెంపుడు కుక్కలు, పిల్లులకు యాంటీ రాబిస్ టీకాలు ఉచితంగా ఇవ్వనున్నట్లు హయత్‌నగర్ పశువైద్యాధికారి డాక్టర్ ఆనంద్‌రెడ్డి తెలిపారు. ఈ అవకాశాన్ని పెంపుడు జంతువుల పెంపకందారులు సద్వినియోగం చేసుకుని తమ పెంపుడు జంతువులకు టీకాలు ఇప్పించి రాబిస్ వ్యాధి వ్యాప్తి చెందకుండా సహకరించాలని ఆయన కోరారు.

యువ పోరాటయాత్రకు తరలిన యూత్ కాంగ్రెస్ నేతలు

మన్సూరాబాద్: రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో గజ్వేల్‌లో ప్రారంభమవుతున్న యువ పోరాట యాత్రకు రాష్ట్ర యూత్ కాంగ్రెస్ క్యాంపెయిన్ ఇన్‌చార్జి జక్కిడి శివచరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎల్బీనగర్ నుంచి యూత్ కాంగ్రెస్ నేతలు బుధవారం బారీగా తరలివెళ్లారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరవుతున్న జాతీయ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బీవీ శ్రీనివాస్‌కు ఎయిర్‌పోర్టులో ఘన స్వాగతం పలికారు. యూత్ కాంగ్రెస్ నాయకులు గణేష్‌రెడ్డి, భీమిడి రామకృష్ణారెడ్డి, మెరుగు రమేష్‌రెడ్డి, గుర్రం శ్యాంచరణ్‌రెడ్డి, శ్రవణ్‌కుమార్, ఎర్రంబెల్లి సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

గుడిసెవాసుల సమస్యలను పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్యే బలాలను సన్మానిస్తున్న దళిత, గిరిజన సేవా సంఘం నాయకులు

మలక్‌పేట: తెలంగాణ రాష్ట్ర దళిత గిరిజన సేవా సంఘం ఆధ్వర్యంలో అఫ్జల్‌నగర్ బంజారా కాలనీ గుడిసెవాసులు మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాలను బుధవారం పంజేషాహలోని కార్యాలయంలో కలిశారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. దశాబ్దాల కాలంగా గుడిసెల్లో నివాసం ఉంటున్న పేదలకు సొంతగూడు లేక ఇబ్బందులు పడుతున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. గతంలో సోషల్ ఎకనామిక్ సర్వే చేసి 131 మందిని లబ్ధిదారులుగా గుర్తించారని, వారికి ప్రభుత్వం సొంత ఇళ్లు కేటాయించేలా చూడాలని ఎమ్మెల్యేకు విన్నవించామన్నారు. గుడిసెవాసులకు న్యాయం చేస్తామని బలాల హామీ ఇచ్చారని వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు అమర్‌సింగ్ నాయక్, లక్ష్మి, ఆమ్‌జీ, తదితరులు ఉన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి



శాకంబరి అమ్మవారి పూజలో పాల్గొన్న రజనీ విఠల్‌రెడ్డి తదితరులు

హస్తినాపురం: చిన్నారులకు పౌష్టికాహారంపై అవగాహన పెంచేందుకు ప్రతి సంవత్సరం తమ పాఠశాలలో శాకంబరి అమ్మవారి ఉత్సవాలను నిర్వహిస్తున్నామని నాగార్జున విద్యాసంస్థల వైస్ చైర్‌పర్సన్ గుమ్మకొండ రజనీ విఠల్‌రెడ్డి తెలిపారు. హస్తినాపురంలోని నాగార్జున మోడల్ స్కూల్‌లో బుధవారం శాకంబరి అమ్మవారి ఉత్సవాలను నిర్వహించారు. వివిధ రకాల పండ్లు, కూరగాయలతో అలంకరించిన అమ్మవారి రూపం విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కె.విజయ్‌కుమార్‌రావు, ఇన్‌చార్జ్‌లు సవిత, దివ్య, పుష్పలత, అరుణ, ప్రియాంక, ఉషశ్రీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం: సామ



హస్తినాపురంలో పర్యటిస్తున్న సామ రంగారెడ్డి

హస్తినాపురం: ప్రజా సమస్యలను పరిష్కరించడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యిందని రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి విమర్శించారు. బుధవారం హస్తినాపురం సెంట్రల్‌కాలనీలోని మేజర్ పద్మపాణి ఆచార్య కమ్యూనిటీ హాల్ నుంచి షిరిడీ సాయినగర్‌కాలనీ, లక్ష్మీనర్సింహపురి కాలనీ, కేశవపురి కాలనీల్లో ఆయన ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తూ బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ప్రతి బీజేపీ కార్యకర్తపై ఉందన్నారు. డివిజన్ పరిధిలోని అనేక ప్రాంతాలలో ఏర్పాటు చేసిన వరదనీటి కాలువల్లోకి డ్రైనేజీ నీరు వచ్చి దుర్గంధం వెదజల్లుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడన్నారు. ఈ పరిస్థితికి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కారణమని, ఆయనకు అభివృద్ధిపై ఏమాత్రం చిత్తశుద్ధి లేదని రంగారెడ్డి విమర్శించారు. కార్యక్రమంలో డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పి.నరేశ్‌యాదవ్, మాధవరెడ్డి, అమరేందర్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, మల్లేశ్‌గౌడ్, రాజేందర్, శ్రీనివాస్, సాయి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడి జన్మదిన వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న యూనియన్ ప్రతినిధులు

వనస్థలిపురం: తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్ జన్మదిన వేడుకలను బుధవారం వనస్థలిపురం ఏరియా ఆసుపత్రిలో నిర్వహించారు. కేక్ కోసి వేడుకలు జరుపుకున్నారు. యూనియన్ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ డాక్టర్ శాంతికుమార్‌గౌడ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నర్సింగ్, ఉపాధ్యక్షుడు భానుప్రకాష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజేష్, జాయింట్ సెక్రటరీ దిలీప్, కోశాధికారి సంధ్య తదితరులు పాల్గొన్నారు.

బాలికను వేధిస్తున్న యువకుడికి 8 రోజుల జైలు

చాదర్‌ఘాట్: బాలికకు ఫోన్ చేసి వేధిస్తున్న యువకుడికి న్యాయస్థానం 8 రోజుల జైలుశిక్ష విధించింది. చాదర్‌ఘాట్ సీఐ ప్రకాష్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అజంపురా డివిజన్ కమలానగర్‌కు చెందిన మహ్మద్ అన్సారీ (23) అదే కాలనీలో నివాసముంటున్న బాలిక (15)కు ప్రతి రోజూ ఫోన్ చేసి వేధించడంతో పాటు బెదిరిస్తున్నాడు. దీంతో బాలిక తల్లిదండ్రులు చాదర్‌ఘాట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మహ్మద్ అన్సారీని అరెస్టు చేసి నాంపల్లి 6వ స్పెషల్ మెట్రోపాలిటన్ కోర్టులో హాజరుపర్చారు. నేరం రుజువు కావడంతో న్యాయస్థానం అతడికి 8 రోజుల శిక్ష విధించింది.

డ్రైనేజీ ఆధునికీకరణకు చర్యలు: కొప్పుల



ఆర్టీసీ సూపర్‌వైజర్స్ కాలనీలోని సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: కాలనీలోని డ్రైనేజీ వ్యవస్థ ఆధునికీకరణకు చర్యలు చేపడతామని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. డివిజన్ పరిధి ఆర్టీసీ సూపర్‌వైజర్స్ కాలనీలో ఆయన బుధవారం మార్నింగ్‌వాక్ చేసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ, కాలనీలోని పార్కులో టాయిలెట్లు ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. రోడ్డు మధ్యలో ఉన్న ఇనుప విద్యుత్ స్తంభాలను తొలగింపజేసి, రోడ్డుకు ఒకవైపు కొత్త స్తంభాలు ఏర్పాటు చేయిస్తానని చెప్పారు. కార్యక్రమంలో కాలనీవాసులు వెంకటేష్, శంకరయ్య, యాదయ్య, రాంరెడ్డి, కృష్ణ,సుదర్శన్, పుల్లయ్య పాల్గొన్నారు. అలాగే, కార్పొరేటర్ నర్సింహారెడ్డి బుధవారం బాలాజీనగర్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని జలమండలి అధికారులు డ్రైనేజీ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. పద్మావతినగర్‌కాలనీ నుంచి బాలాజీనగర్‌కాలనీ వరకు నూతన డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయించినందుకు కార్పొరేటర్‌కు కాలనీవాసులు ధన్యవాదాలు తెలిపారు.

పఠన నైపుణ్యాల పెంపే లక్ష్యం



ఓల్డ్‌మలక్‌పేట హైస్కూల్‌లో పఠనోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

- ప్రభుత్వ పాఠశాలల్లో జోరుగా పుస్తక పఠనోత్సవం
- రోజూ ఒక పీరియడ్ కేటాయింపు
- హెచ్‌ఎంల పర్యవేక్షణలో కొనసాగుతున్న కార్యక్రమం

చాదర్‌ఘాట్: విద్యార్థుల్లో పఠనంపై ఆసక్తి, నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో విద్యాశాఖ అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పఠనోత్సవ కార్యక్రమాన్ని సోమవారం నుంచి ప్రారంభించింది. ఈనెల 31 వరకు 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఈ కార్యక్రమం నిర్వహించాలని విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో మలక్‌పేట జోన్ పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ఈ పఠనోత్సవాన్ని ప్రారంభించగా, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. జోన్ పరిధిలో 9 ఉన్నత, 26 ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేశారు. అన్ని పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుల ప్రత్యేక పర్యవేక్షణలో ఈ కార్యక్రమం అమలు చేస్తున్నారు. విద్యార్థులు ధారాళంగా చదవగలరని, వారిలో పఠనాశక్తిని పెంపొందించాలని, స్వతంత్రంగా ఎదగాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఓల్డ్‌మలక్‌పేట మూగ, బధిరుల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామ్‌మోహన్ తెలిపారు.

హెచ్‌ఎంలదే బాధ్యత...

పాఠశాల స్థాయిలో ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో పఠనోత్సవం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాన్ని ఆయా పాఠశాలల్లో హెచ్‌ఎంలు పర్యవేక్షిస్తారు. ప్రతి తరగతికి రోజూ పుస్తక పఠనం కోసం ఒక పీరియడ్ కేటాయిస్తారు. ప్రతి పాఠశాలలో ఐదుగురు విద్యార్థులతో గ్రంథాలయ కమిటీ ఏర్పాటు చేశారు. పిల్లల్లో పోటీతత్వం పెంపొందించేందుకు ప్రతి శనివారం పఠన పోటీలు నిర్వహిస్తారు. జూలై 10 నుంచి 17 వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించి విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించారు. స్వచ్ఛంద సంస్థలను భాగస్వామ్యులను చేసి సామాజిక సేవపై అవగాహన కల్పించనున్నారు.